క్లుప్తంగా

20న వాహనాల వేలం

పలమనేరు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరిండెంటెంట్ కృష్ణ కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా నిర్ణయించిన రుసుం చెల్లించి వేలంపాటల్లో పాల్గొనాలని సూచించారు.

వినాయక చవితికి ప్రతిమలు సిద్ధం


విక్రయానికి ఉంచిన వినాయక ప్రతిమలు

సదుం: వినాయక చవితికి ప్రతిమలు సిద్ధం అయ్యాయి. ఊరూవాడా వినాయక మండపాల్లో ప్రతిమలు ఏర్పాటు చేసి, యువకులు చేసే కోలాహలం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో పలు చోట్ల వినాయక విగ్రహాలను విక్రయిస్తున్నారు. చిన్నపాటి విగ్రహాల నుంచి భారీ విగ్రహాల వరకు అమ్మకానికి ఉంచినట్లు విక్రయదారులు తెలి పారు. పలువురు ముందస్తుగా అడ్వాన్సులు చెల్లించి విగ్రహాలను ఖరారు చేసుకుంటున్నారు.

ఆటోలో మంటలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని నక్కబండ ప్రాంతంలోని సర్దార్‌కు చెందిన ఆటోలో శుక్రవారం రాత్రి మంటలు రేగాయి. ఈ విషయం గమనించిన ఆ ప్రాంత ప్రజలు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలును అదుపు చేశా రు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2.70 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

వందే జగద్గురుమ్

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


పలమనేరులో శ్రీకృష్ణుని ఊరేగింపు

నవనీత చోరుడతడు..నీలమేఘశ్యాముడతడు.. మురిపాల మోహనుడతడు.. ముద్దులొలికే చిన్నికృష్ణుడతడు.. ముక్కోటి దేవతల్లో చూడచక్కని రూపవంతుడతడు.. చిన్ని కన్నయ్య పుట్టిన రోజు జగమంత వేడుకల రోజు.. అంటూ కృష్ణాష్టమి సందర్భంగా పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో ఊరూవాడా వైభవంగా గోకులాష్టమి జరుపుకున్నారు.

పలమనేరు: పట్టణంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పాతపేట శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి సప్తోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయం వద్ద గోపూజ, అభిషేకం, ఆస్థాన సేవలు జరిగాయి. ప్రభోనానంద స్వామి భక్తులు పట్టణంలోని రఘువీరారెడ్డి కాలనీ వద్ద కృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు జరిపారు. అనంతరం పట్టణంలో కృష్ణుని ఊరేగింపు జరిగింది. జయకృష్ణ, భగవద్గీత శ్లోకాలను పలుకుతూ భక్తులు ఇందులో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమం కన్నమాకులపల్లిలో ఘనంగా జరిగింది. పలువురు తమ పిల్లలకు చిన్ని కృష్ణుని వేషధారణలు చేపట్టారు.


పలమనేరు: విశేషాలంకరణలో వేణుగోపాలస్వామి

యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కృష్ణంరెడ్డి పల్లె రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించి పూజలు చేశారు. వేకువజాము నుంచి ఆలయంలో అభిషేకాలు జరిపారు. స్వామి వారికి విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం చిన్నారులు, పెద్దలు కలసి శ్రీకృష్ణ వేషధారణలు ధరించారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటలు, పిల్లనగ్రోవి పాటల నడుమ మేళతాళాలతో స్వామివారిని పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదానాలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. సీఐ సుబ్బరాయుడు, పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

వేడుకగా కృష్ణ జన్మాష్టమి

సదుం: మండలంలో కృష్ణాష్టమిని శనివారం వేడుకగా నిర్వహించారు. పలు ఆలయాలను భక్తులు దర్శించారు. కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుని వేషంలో అలంకరించి మురిసిపోయారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు

పుంగనూరు: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం శ్రీకృష్ణ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

వి.కోటలో ఘనంగా..

వి.కోట: కృష్ణాష్టమి సందర్భంగా శనివారం వి.కోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే రామాపురం గ్రామంలో ప్రభోధసేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామాపురంలో గోపికల వేషధారణలతో ప్రభోదా సేవా సమితి వారి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారిని, ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రుక్మిణిసత్యబామ సమేతశ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నారు.

కృష్ణార్జున దేవాలయంలో వేడుకలు

కుప్పం: కృష్ణాష్టమి సందర్భంగా కుప్పం పట్టణం గుడుపల్లెలోని కృష్ణార్జున దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేసి, భక్తులకు దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నకృష్ణుని వేషధారణలతో వచ్చిన పిల్లలు ఆకట్టుకున్నారు. సాయంత్రం శ్రీకృష్ణా ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో ఊరేగించారు. పట్టణం డీటీ రోడ్డులోని యాదవ సంఘం భజన మందిరంలో శ్రీ కృష్ణ ప్రతిమలను కొలువుదీర్చి, కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.




కుప్పంలో పూజలు చేస్తున్న భక్తులు, పుంగనూరులో యాదవ సంఘం సభ్యుల ర్యాలీ, పుంగనూరులో శ్రీకృష్ణ వేషధారణలో యాదవ సంఘం సభ్యులు





వి.కోట: కృష్ణమ్మ కొండపై పల్లకిలో స్వామివారి ఊరేగింపు, రామాపురంలో శ్రీకృష్ణుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు, వి.కోటలో వేణుగోపాలస్వామి ఊరేగింపు, (ఇన్‌సెట్) స్వామివారు

సూపర్ సిక్స్ ఎక్కడ చంద్రబాబూ?


బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ పోస్టర్లు విడుదల చేస్తున్న రెడ్డెప్ప, అలీమ్‌బాషా, నాగభూషణం

పుంగనూరు: అధికారం కోసం హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ ఎక్కడ అమలైందో సీఎం చంద్రబాబు చెప్పాలంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం నిలదీశారు. శనివారం బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎన్ఎస్ పేటలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ స్కానర్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని, వీటిని ప్రజలందరు గమనించాలని కోరారు. హామీలు నేరవేర్చని కూటమి నాయకులకు తగిన గుణపాఠం నేర్పాలని ఆయన పిలుపునిచ్చారు. బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో ప్రతిరోజూ 15 రోజుల పాటు నిర్వహిస్తామని నాగభూషణం తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, సీఆర్.లలిత, మైనార్టీ సెల్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫకృద్దీన్‌షరీఫ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, నాయకులు నరేష్, సిద్దిక్, నవాజ్, ఎంఎం.ఆనంద, సలామత్ తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం

వి.కోట: పట్టణంలోని బంగ్లాచేనులో ఉన్న మంజులమ్మ ఇంటి పెరట్లోని బ్రహ్మకమలం మొక్కకు శనివారం బ్రహ్మకమలాలు విరబూశాయి. ఏడాదికి ఒకసారి మాత్రం అరుదుగా పూసే బ్రహ్మకమలాలు ఒకసారిగా విరబూయడంతో ఈ దృశ్యాన్ని చూడడానికి ఇరుగుపొరుగు వారితోపాటు పట్టణవాసులు తరలి వచ్చారు. తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నట్లు మంజులమ్మ తెలిపారు.



పథకాల కోతపై ప్రజలకు వివరించండి


కరపత్రాలు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రొంపిచెర్ల: అన్నదాతసుఖీభవ, తల్లికి వందనం, స్త్రీశక్తి తదితర సూపర్‌సిక్స్ పథకాల పేరుతో సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల కు వివరించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. శనివారం జాండ్లవారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామాల్లో శనివారం నిర్వహించిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, కూటమి మోసాల ను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడు తూ చంద్రబాబు అమలు చేస్తున్న ఏ పథకంలోనూ లబ్ధిదారులకు వంద శాతం న్యాయం జరగలేదన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్న పథకాల్లో కనీసం 50 శాతం మంది లబ్ధిదారులకు కూడా న్యాయం జరగడం లేదన్నారు. గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, హరినాథరెడ్డి, డి.రామనారాయణరెడ్డి, కరీము ల్లా, రాజేంద్రరెడ్డి, అమరనాథరెడ్డి, రామనారాయణరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, విజయ శేఖర్, రవీంద్ర, రాజమోహన్, చంద్రారెడ్డి, కుమార్‌రెడ్డి, సి.వి.రమణ, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరోం హర

- కావళ్లతో కిటికిటలాడిన అగ్రహారం ఆలయం
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు



పెద్దపంజాణి: కావడి చెల్లింపులకు వెళుతున్న భక్తులు

పలమనేరు: పట్టణ సమీపంలోని టీఎస్ అగ్రహారం సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు కావళ్లతో హరోంహర అంటూ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కొండపై కొలువైన సుబ్రమణ్యస్వామి ప్రధాన ఆలయం భక్తులతో కిటికిటలాడింది. కొండ కింద ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, నాయకులు హాజరయ్యారు. అన్నదానాలు చేశారు.

ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు

పెద్దపంజాణి: మండలంలోని సూరకుంట్ల సమీపంలోని మునీశ్వరస్వామి కొండపై ఆడికృత్తిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి వారికి గొందమాకులపల్లి, కడపల్లి భక్తులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు కావడి చెల్లింపులు చేశారు. బసవరాజు కండ్రిగ గ్రామస్తులు కావడి చెల్లింపులకు భక్తిశ్రద్ధలతో తిరుత్తణికి బయలుదేరి వెళ్లారు.

హరోం.. హర నామస్మరణలతో మారుమోగిన శివాలయం

చౌడేపల్లె: మండల కేంద్రంలోని బజారువీధిలో ఉన్న అభీష్టదమృత్యుంజయేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాలు హరోం... హర నామస్మరణలతో మారుమోగాయి. శనివారం ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శ్రీవళ్లి దేవసేన సమేత శ్రీషణ్ముఖ సుబ్రమణ్యస్వామివారికి అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమార స్వామి, మహేష్ స్వామి ఆధ్వర్యంలో విశేషాలంకరణ చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి కృత్తిక కావళ్లు చెల్లించి భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తులు పసుపు రంగు దుస్తులు ధరించి కుటుంబసమేతంగా కావళ్లతో ఆలయానికి చేరుకుని పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. మరికొందరు నోటిలో నాలుకపై శూలాలు గుచ్చుకుని కావళ్లతో వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చారు. రఘుస్వామి సహకారంతో భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలు అందించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

సదుం: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, నెమలి ఈకలు, గంధం, హారం, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేషాలంకారంలో ఉన్న స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించి, కావిళ్లు చెల్లించారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు రద్దీ క్రమబద్ధీకరించారు.

ఆలయ ఆవరణలో ఉత్సవ మూర్తులకు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రదీప్ రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, మల్‌రెడ్డి, కమ్మిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీధర్, మురళీ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.


పలమనేరు: కావళ్లతో ఆలయానికి వెళుతున్న భక్తులు


చౌడేపల్లి: కావళ్లతో ఆలయానికి వెళుతున్న భక్తులు


సదుం: సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాజ్‌వే నిర్మించాలి


అసంపూర్తిగా ఉన్న కాజ్‌వే పనులు

రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీ శ్రీనాథపురం కాలనీ సమీపంలోని బడబళ్ల వంకపై కాజ్‌వే నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు కాజువే కొట్టుకుని పోయిందన్నారు. దీంతో అధికారులు కాజ్‌వే పనులను ప్రారంభించి, ఐదు పైపులను కూడా వేశారన్నారు. ఈ కాజ్‌వేపైన కొండారెడ్డిగారిపల్లె, బలిజపల్లె, గాదిచెరువుపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తారన్నారు. కాజ్‌వే తెగిపోతే ఆ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయన్నారు. కాజ్‌వే వెడల్పుగా ఉందని కనీసం 10 సిమెంటు పైపులను ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రజలు తెలిపారు. అయితే ఐదు పైపులు వేసి మిగిలిన పని చేయకుండానే పనులు ఆపి వేశారని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిన్నగొట్టిగల్లు చెరువు నిండి మొరవ పారితే బడబళ్లవంకలో నీరు ఉధృతంగా ప్రవహించే అవకాశాలు ఉన్నాయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, తగు చర్యలు తీసుకుని కాజ్‌వే పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.